

వైఫల్యాల 'జాతర'
వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి జాతరలో ఆది నుంచి అన్నీ తప్పిదాలతో ముగిసింది. - 8లో



పరిశ్రమల అభివృద్ధికి సహకారం
జిల్లాలో పరిశ్రమల స్థాపనతోపాటు వాటి అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ వెల్లడించారు. - 8లో



ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం
వైఎస్సార్‌సీపీలో యువతే కీలకమని భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. - 8లో

జిల్లా నూతన ఎస్పీగా సుబ్బరాయుడు



తిరుపతి క్రైం : జిల్లా నూతన ఎస్పీగా సుబ్బరాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతిలో పనిచేస్తున్న హర్షవర్ధన్‌రాజు ప్రకాశం జిల్లాకు బదిలీ చేయగా.. రెడ్ శాండిల్ ఎస్పీగా ఉన్న సుబ్బరాయుడును తిరుపతి ఎస్పీగా నియమించారు. ఈయన గతంలో జిల్లా ఎస్పీగా పని చేస్తూ వైకుంఠ ఏకాదశి తొక్కిసలాట కారణంగా బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.



ప్రశ్నించే గళంపై ప్రతీకారం



కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తోంది. చంద్రబాబుకు వ్యవస్థలను తన చేతుల్లోకి తీసుకుని ప్రశ్నించే గళంపై ప్రతీకారం తీర్చుకోవడం వెన్నతో పెట్టిన విద్య. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా ఉంటూ సమస్యలను ఎత్తిచూపుతూ వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న మీడియాపై కేసులు నమోదు చేయడం దుర్మార్గం. ప్రజలు హర్షించరు. ప్రభుత్వ వైఫల్యాలను సాక్షి పత్రిక ఎత్తిచూపుతోందని ఎడిటర్‌పై, విలేకరులపై అక్రమ కేసులు నమోదు చేసి కక్ష సాధింపు చర్యలకు దిగజారడం నీచ సంస్కృతికి నిదర్శనం. ఇలాంటి దారుణమైన పరిస్థితులు దేశచరిత్రలో గతంలో చూడలేదు. సాక్షి పత్రికపై పక్షపాత ధోరణితో కేసులు బనాయించి, పోలీసులతో దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదు. **– భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు**

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తారా!



కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. పత్రికల్లో నిజాలు రాస్తే ఉలిక్కి పడుతోంది. రాసిన వార్తల్లో నిజాలున్నపుడు దాన్ని సవరించుకుని పాలన సాగించాల్సింది పోయి పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తారా! ఇదేనా ప్రజాస్వామ్యం.. ఇదేనా ప్రతికలకు కూటమి ప్రభుత్వం ఇచ్చే స్వేచ్ఛ..భారత రాజ్యాంగంలో నాలుగో స్తంభంగా ఉన్న పత్రికా వ్యవస్థ కూడా మీ స్వాధీనంలో పని చేయాలా! రాజ్యాంగ వ్యవస్థను కాలరాసే విధంగా ప్రవర్తించడం చూస్తుంటే రాజ్యాంగం మీద వీళ్లకు గౌరవం లేకుండా పోయింది. వీళ్లు రచించుకున్న రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అక్రమ కేసులు పెట్టి అరాచకాలు చేస్తున్నారు. ప్రకృతి సంపదలైన ఇసుక, మట్టి, గ్రావెల్ దందాలు చేస్తున్న తెలుగు తమ్ముళ్లను ప్రశ్నిస్తే దొంగ కేసులు నమోదు చేస్తున్నారు. ఇలాంటి వార్తలను రాసిన విలేఖరులపై అక్రమంగా కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. **– కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట**

భయంకరి



పలమనేరులో ఓ మదపుటేనుగు హల్‌చల్ చేసింది. అడవిలోంచి ఒంటరిగా జనావాసాల్లోకి వచ్చి బీభత్సం సృష్టించింది. దాన్ని చూసి జనం కేకలు వేయడంతో మరింత చిర్రెత్తిపోయింది. దాదాపు ఆరు గంటలపాటు రోడ్లపై స్వైరవిహారం చేసింది. అడ్డొచ్చిన వారిపై ఎదురుదాడికి దిగింది. బుల్లెట్‌పై వచ్చిన ఎఫ్‌ఎస్వో సుకుమార్‌పై దాడికి తెగబడింది. తనదారికి అడ్డొచ్చిన వాహనాలను ఎత్తిపడేసింది. ఓ లేగదూడపైన, అడవిలోకి మళ్లించేందుకు ప్రయత్నించిన ట్రాకర్‌పై దాడి చేసి.. ఆ తర్వాత అడవిలోకి వెళ్లింది.

పలమనేరులో
ఒంటరి ఏనుగు స్వైరవిహారం

- కౌండిన్య నుంచి పట్టణ ఆవాసాల్లోకి చొరబడిన వైనం
- ఏనుగు దాడిలో ఎఫ్‌ఎస్వోకు, మావటికి తీవ్రగాయాలు
- ట్రాకర్స్ దారిమళ్లించే క్రమంలో ఎదురుదాడి
- ఎట్టకేలకు గంటావూరు వద్ద అడవిలోకి వెళ్లిన ఏనుగు
- ఊపిరి పీల్చుకున్న ఫారెస్ట్ అధికారులు



ఎఫ్‌ఆర్వో సుకుమార్‌పై దాడి చేస్తున్న ఏనుగు



పలమనేరు పట్టణంలో సంచరిస్తున్న మదపుటేనుగు

పలమనేరు: కౌండిన్య ఎలిఫెండ్ శాంచురీ సమీపంలోని అడవిలోంచి ఓ ఒంటరి ఏనుగు శనివారం ఉదయం పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డు సమీపంలోకి వచ్చింది. ఇదే సమయంలో ఈ ప్రాంతంలో వాకింగ్ చేస్తున్న వారు గమనించి స్థానిక ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్‌ఎస్వో సుకుమార్ తన సిబ్బంది ట్రాకర్స్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాణసంచా పేలుస్తూ ట్రాకర్స్ ఏనుగును మళ్లించే ప్రయత్నం చేశారు. దీంతో పాటు స్థానికుల అరుపులు, కేకలు, సెల్‌ఫోన్లలో వీడియోలు తీయడం లాంటివి చేశారు. ఆగ్రహించిన ఏనుగు జనంపైకి ఎదరుదాడికి దిగింది. ఇదే సయంలో పాత కీలపట్ల రోడ్డు వద్ద బుల్లెట్‌పై వచ్చిన ఎఫ్‌ఎస్వో సుకుమార్ పైకి దాడికి పాల్పడింది. ఆయన తప్పించుకునే ప్రయత్నంలో బైక్‌ను ఆపి పరుగెత్తబోయి కిందపడ్డాడు. ఆ ఏనుగు అతనిపై పడి నలిపేసింది. జనం గట్టిగా అరుపులు పెట్టగా ట్రాకర్లు నాగరాజు తదితరులు రాళ్లతో ఏనుగుపై దాడి చేశారు. దీంతో అది అక్కడి నుంచి పక్కకెళ్లింది. 108 సమయానికి రాకపోవడంతో ఫారెస్ట్ వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఏనుగు దాడిలో సుకుమార్‌కు కాలు, చేయికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడ ప్రథమ చికిత్సలనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ఆరు గంటలపాటు హల్‌చల్

ప్రజల అరుపులు, అలజడితో ఏనుగు ఘీకాంరాలు చేస్తూ ఎటు వెళ్లాలో తెలియక రాఘవేంద్రస్వామి ఆలయం, చిన్నూరు, బైపాస్‌రోడ్డు, గంటావూరు, బెంగళూరు- చెన్నై హైవే బైపాస్ తదితర ప్రాంతాల్లో హల్‌చల్ చేసింది. హైవేలో ఏనుగు వెళుతున్నప్పుడు వందలాది మంది రోడ్డుపక్కన గుమిగూడారు. ఏనుగు కారణంగా బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ ఆగిపోయింది. ఏనుగును చూసేందుకు జనం రోడ్డుపై ఆగిన వాహనాలపై ఎక్కి గోల చేశారు. దీంతో మరింత భయపడిన ఏనుగు గంటావూరు వద్ద టెర్రకోట దుకాణాల మధ్య రోడ్డుపై వెళుతూ రోడ్డు పక్కన పార్క్ చేసిన పలు కార్లను పైకెత్తేందుకు ప్రయత్నించింది. అక్కడికి వచ్చిన ఫారెస్ట్ జీపుపై దాడికి రాగా డ్రైవర్ చాకచక్యంగా జీపును రివర్స్‌చేసి వెళ్లిపోయాడు.

మదపుటేనుగులతో జాగ్రత్త



అడవిలోంచి జనావాసాల్లోకి వచ్చే మదపుటేనుగులు చాలా కోపంగా ఉంటాయని, వీటితో జనం జాగ్రత్తగా ఉండాలని స్థానిక అటవీశాఖ అధికారి నారాయణ సూచించారు. జనం ఎక్కువగా కేకలు పెట్టడం, దాన్ని తరమడం చేసినప్పుడు ఏం చేయాలో దిక్కుతోచక జనంపైకి తిరగబడుతుందన్నారు.

నాలుగైదు మదపుటేనుగుల సంచారం...



కౌండిన్య అడవిలో పది దాకా మదపుటేనుగులుండగా వాటిల్లో ఐదుదాకా మృత్యువాత పడ్డాయి. ప్రస్తుతం నాలుగైదుదాకా ఒంటరిగా సంచరిస్తూ తరచూ జనావాసాలవైపు వస్తున్నాయి. అయితే ఇది తక్కువ వయసున్న మదపుటేనుగని, కొత్తగా ఇటువైపు వచ్చిందని స్థానిక ఎఫ్‌ఆర్వో నారాయణ మీడియాకు తెలిపారు. ఎఫ్‌ఎస్వో సుకుమార్‌పై జరిగిన దాడిలో ఆయన ఏనుగుకు అత్యంత సమీపంలో ఉండడం, కాలు జారి కిందపడడంతో తప్పించుకొనే అవకాశం లేకుండా పోయింది.

మావటిపై దాడి!



అక్కడి నుంచి గంటావూరు వైపుకెళ్లిన ఏనుగును అడవిలోకి మళ్లించేందుకు స్థానిక ఎలిఫెంట్ ట్రాకర్స్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో కుంకీ ఎలిఫెంట్లకు మావటి హరి దీన్ని నిలువరించే ప్రయత్నం చేయగా అతనిపై దాడికి తెగబడింది. గాయపడిన మావటిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. గతంలోనూ హరి ఏనుగులను మళ్లించే క్రమంలో చేతిలో బాంబుపేలి గాయపడ్డాడు. అక్కడి నుంచి వెళుతూ గడ్డి మేస్తున్న ఓ లేగదూడను తొక్కేసింది.

ఎట్టకేలకు అడవిలోకి..



పట్టణంలో ఆరుగంటల పాటు అటవీశాఖ, ప్రజలకు ముప్పు తిప్పలు పెట్టించిన ఏనుగు గంటావూరు సమీపంలో అడవిలోకి వెళ్లింది. దీంతో ఎలిఫెంట్ ట్రాకర్స్ ఊపిరి పీల్చుకున్నారు. కానీ అదే మదపుటేనుగు మళ్లీ ఇదే ప్రాంతానికి వస్తుందని ట్రాకర్స్ అనుమానిస్తున్న నేపథ్యంలో జనం భయపడుతున్నారు.

తిరుమలలో టీటీడీ ఈవో
ఆకస్మిక తనిఖీలు



భక్తుల అభిప్రాయాలను సేకరిస్తున్న టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్

తిరుమల : తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ శనివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన ఆయన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. తిరుమలలో తప్పిపోయిన వారిని గుర్తించే ప్రక్రియ మరింత వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుమలలోని ప్రతి అంగుళాన్ని మానిటర్ చేయగల విధంగా సిబ్బందిని నియమించి కమాండ్ కంట్రోల్ సెంటర్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. రియల్ టైమ్‌లో వ్యక్తుల గుర్తింపు, ఘటనలపై నిఘా కోసం ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను వినియోగించాలని ఆదేశించారు. అనంతరం ఈవో లగేజీ కౌంటర్‌ను పరిశీలించి భక్తులతో మాట్లాడారు. అనంతరం ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -2 కు చేరుకుని భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. తనిఖీల్లో ఈవో వెంట సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు బ్రహ్మర్షి ఆశ్రమానికి మారిషష్ ప్రధాని



ఆశ్రమంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

రామచంద్రాపురం : మండలంలోని శ్రీ సిద్ధేశ్వర బ్రహ్మర్షి ఆశ్రమాన్ని మారిషష్ ప్రధాని సందర్శించనున్నారు. సోమవారం సిద్ధగురువర్ శ్రీ సిద్ధేశ్వర బ్రహ్మర్షి గురుదేవుల దివ్య ఆశీస్సులు పొందునున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. విదేశీ ప్రధాని రాకతో శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ప్రత్యేక పోలీస్ నిఘా వర్గాలతో కలిసి ఆశ్రమంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

లోకసభ స్పీకర్‌కు స్వాగతం



స్పీకర్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు : తిరుపతిలో జరగనున్న జాతీయ మహిళా సాధికారిత సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో శనివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న లోకసభ స్పీకర్ ఓం బిర్లాకు ఘనస్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు, ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు.

గెజిటెడ్ ఆఫీసర్ల కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : ఏపీ మాల గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గం ఎంపికైంది. ఈ మేరకు ఎస్వీయూలోని ఇంజినీర్స్ భవన్‌లో శనివారం ఆ సంఘం జిల్లా, రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మాల ఉద్యోగులు ఐక్యతో కలసికట్టుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా జంగా విజయానంద, సెక్రటరీగా రామకృష్ణ, ట్రెజరర్‌గా వెంకటేశర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రత్నప్రసాద్, వైస్ ప్రెసిడెంగా అరవింద్, అడ్వైజర్‌గా శంకరయ్య, పబ్లిక్ సెక్రటరీగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ జడ్జి గుర్రప్పను గెజిటెడ్ అధికారులు ఘనంగా సన్మానించారు.

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి



నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న బీజేపీ నేతలు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్‌తో పాటు ఇతర అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజ స్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపుల కేంద్ర మంత్రికి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో దేవేరుల చిత్రపటాన్ని అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో పాటు ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు మహిళా సాధికారత సదస్సు

- తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్ వేదిక
- హాజరు కానున్న లోకసభ స్పీకర్, గవర్నర్, శాసనసభ స్పీకర్, ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులు
- సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10 టీవీలకు పాస్‌లు నిలుపుదల



రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య

తిరుపతి అర్బన్ : మహిళల సాధికారత అంశాన్ని అజెండాగా చేసుకుని ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిని వేదికగా తీసుకుని దేశస్థాయి కార్యక్రమాన్ని చేపడుతున్నారు. లోకసభ స్పీకర్ ఓంబిర్లా ఆధ్వర్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్లమెంటరీ అండ్ లెజిస్లేటివ్ కమిటీ సమావేశాన్ని ఆది, సోమవారం జరుపుకోనున్నారు. సదస్సు ముఖ్య ఉద్దేశ్యం వికసిత్ భారత్‌లో భాగంగా మహిళలు సైతం డిజిటల్ దిశగా అడుగులు వేయడానికి, క్వాంటమ్ కంప్యూటరింగ్, బయో టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయ, వ్యాపార రంగాల్లో మహిళల పాత్ర తదితర సెక్టార్లకు సంబంధించి చర్చలు జరపనున్నారు. ఈ క్రమంలో అధికార యంత్రాంగం సదస్సును విజయవంతం చేయడానికి రెండు రోజులుగా శ్రమిస్తోంది. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు తదితరులు లైజన్, నోడల్ అధికారులతోపాటు జిల్లాస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ సదస్సును జయప్రదం చేయడానికి కృషి చేస్తున్నారు.

నేడు ముఖ్య అతిథులు రాక

ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌కు పలువురు వీఐపీలు రానున్నారు. సదస్సుకు సంబంధించి రెండు రోజుల పాటు రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశాలు నిర్వహించనున్నారు. అనంతరం చంద్రగిరి కోటను సందర్శించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులతో పాటు లోకసభ స్పీకర్ ఓంబిర్లాతో పాటు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, లోకసభ కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి, రాష్ట్ర కమిటీ చైర్‌పర్సన్ చరితారెడ్డి, పలువురు ఐఏఎస్ సీనియర్ అధికారులు ఆదివారం హాజరు కానున్నారు. అలాగే సోమవారం ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నారు.

సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10 టీవీలకు పాస్‌లు నిలుపుదల

జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ మహిళా సదస్సు కార్యక్రమానికి మీడియాకు సమాచారశాఖ వారు ఆహ్వానం పలికారు. అయితే దేశ స్థాయిలో సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో సమాచారశాఖ నుంచి పాస్‌లు జారీ చేసిన వారు మాత్రమే హాజరు కావాలని స్పష్టం చేశారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10 టీవీలకు చెందిన రిపోర్టర్లకు పాస్‌లను ఇవ్వడం లేదని సమాచారశాఖ జిల్లా అధికారి గురుస్వామి శెట్టి స్పష్టం చేశారు.

క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 1478 కేసులు పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న జడ్జి గురునాథ్

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో 1478 కేసులు పరిష్కారం అయినట్లు తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎం.గురునాథ్ తెలిపారు. పరిష్కారమైన మొత్తం కేసుల్లో పెండింగ్ లో ఉన్న సివిల్, క్రిమినల్, మోటారు వాహన ప్రమాద కేసులు, వివాహ సంబంధ కేసులు 342, వ్యాజ్యం వేయని బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ సంస్థలకు చెందిన 28 కేసులు, జరిమానా చెల్లించేవి 1108 కేసులు ఉన్నాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. కేసుల పరిష్కారం కోసం ఎనిమిది బెంచులను ఏర్పాటు చేసినట్టు న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బీమా, బ్యాంకు, రెవెన్యూ, బీఎస్ఎన్ఎల్ , వివిధ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

విశ్వం విద్యాసంస్థలకు జాతీయ పురస్కారం



అవార్డును అందుకుంటున్న విశ్వం విద్యా సంస్థల డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి సిటీ : విశ్వం సైనిక్ నవోదయ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు 'బెస్ట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్–25' ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం బెంగుళూరు వేదికగా జరిగిన భారతీయ శిక్షణ రత్న అవార్డులు–2025 కార్యక్రమంలో భాగంగా ఈ వార్డును ఆ సంస్థ ప్రతినిధులు మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంతోష్ హెగ్డే, ప్రముఖ విద్యావేత్త రంజన రజోర శర్మ చేతుల మీదుగా విశ్వం విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో కర్ణాటక మంత్రి హెచ్ ఆంజనేయ, ఆధ్యాత్మిక నాయకులు డాక్టర్ మలయ శాంతముని, నటుడు చేతన్ కుమార్ పాల్గొని విశ్వం విద్యా సంస్థలకు అభినందనలు తెలిపారు.

వైఫల్యాల 'జాతర'





ప్రొటోకాల్ లేని వ్యక్తులతో కిటకిటలాడుతున్న వీఐపీ క్యూ



పోలీసు బందోబస్తు లేకుండా సరవళ్లు తీసుకొస్తున్న రాజా అనుచరులు

- కూటమి జాతరగా మార్చేసిన వైనం
- అడుగడుగునా అపశ్రుతులే
- క్యూలైన్లలో కల్పించని సౌకర్యాలు
- ఇబ్బందులు పడ్డ చిన్నపిల్లలు, వృద్ధులు
- కూటమి నేతలకే దర్శన భాగ్యం
- ఇదీ వెంకటగిరి జాతర తీరుతెన్నులు

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి జాతరలో ఆది నుంచి అన్నీ తప్పిదాలతో ముగిసింది. అమ్మవారి జాతర ప్రధాన ఘట్టాలైన జాతర అనుమతి (తాంబులం స్వీకరణ) నుంచి జాతర ముగిసే వరకు అడుగడుగునా వైఫల్యాలతో జన జాతర రాజకీయ జాతరగా ముగిసింది. 2023వ సంవత్సరంలో రాష్ట్ర పండుగగా ప్రకటించిన జాతరను అప్పటి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జాతరను ఐదు రోజుల పండుగలా హంగులు, ఆర్భాటాలతో నిర్వహించారు. రెండేళ్లుగా జరుగుతున్న పోలేరమ్మతల్లి జాతరలో సామాన్య భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం గగనమైంది. ఈ ఏడాది ప్రత్యేకంగా కూటమి నేతల కనుసన్నల్లో జాతర నిర్వహణ జరగడంతో రాజకీయ జాతరగా మిగిలిపోయింది.

తప్పిదాలు ఇలా..

- రాజా కుటుంబీకుల వద్ద జాతర అనుమతికి అమ్మవారి సేవకులకు అందించనున్న తాబూలం స్వీకరణ ఆరంభం నుంచి వివాదాలు, పొరపాట్లు ప్రారంభమయ్యాయి.
- అమ్మవారి సేవకులను ఆ రెడ్డి పెత్తనం మాకొద్దంటూ రెడ్డి వద్ద నుంచి తాంబూలం నిరాకరణ, గతంలో ఎప్పుడూ లేని విధంగా రాజాల అనుచరుల వద్ద నుంచి తాంబూలం స్వీకకరణ.
- అదేరోజు రాత్రి నిర్వహించాల్సిన అమ్మవారి తొలి చాటింపులో కాంపాళెంలోని కామాక్షమ్మ గుడి వద్ద ఆలయ అధికారులు, రెడ్డి పెత్తందారులు పూజలు నిర్వహిస్తుండగా రాత్రి 12.00 గంటలకు 5, 10 నిమిషాల ముందే కేవలం అమ్మవారి సేవలు పోలేరమ్మతల్లి చాటింపు అంటూ చాటింపు వేయడం.
- ఈనెల 3వ తేదీన నిర్వహించిన చాటింపులో 12.00 గంటల లోపు వేయాల్సిన చాటింపు 12.00 గంటల పైన సంప్రదాయాలకు విరుద్ధంగా వేయడం పై పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఈనెల 7వ తేదీన ఆదివారం జరిగిన ఘటోత్సవంలో సంప్రదాయాలను తుంగలో తొక్కి అత్యుత్సాహం ప్రదర్శించి ప్రత్యేక వాహనంలో ఘటం కుండలను ఏర్పాటుపై పట్టణ వాసుల ఆగ్రహం.
- అమ్మవారికి బలి ఇచ్చే దున్నపోతు విషయంలో సంప్రదాయం పాటించడంలేదనే విమర్శలు.
- అమ్మవారి నిలుపు బుధవారం రోజు కుమ్మరింట ప్రతిమను తయారు చేసే సమయంలో సంప్రదాయాలకు విఘాతం కలిగించే విధంగా అమ్మవారి పూర్తిగా అలంకరణ కాకుండానే ఫొటోలు తీసి సోషల్ మీడియాలో ప్రత్యక్షమవ్వడం.
- మెట్టినిళ్లు అయిన జీనుగులు వారి వీధిలోని చాకలి మండపం వద్ద అమ్మవారికి కళ్లు దిష్టిచుక్క పెట్టే క్రమంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులు కాళ్లకు షూ ధరించి మండపం లోపలో విధులు నిర్వహించడంతో పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- సంప్రదాయబద్ధంగా అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క పెట్టాల్సిన అమ్మవారి సేవకులు పెట్టాల్సి ఉండగా స్థానిక నిర్వాహకులు అత్యుత్సాహం ప్రదర్శించి కార్యక్రమాన్ని పూర్తి చేశారు.
- అమ్మవారి దేవస్థానం వద్ద గురువారం భక్తుల దర్శనార్థం కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో అధిక సంఖ్యలో పోటెత్తారు.
- ఈ క్యూలైన్‌లలో భక్తులకు మంచినీటి సౌకర్యం, చిన్న పిల్లలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ఇబ్బందులు
- వీఐపీ క్యూన్‌లైన్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసినా కేవలం కూటమి నేతలకే అధిక ప్రాధాన్యం కల్పించారు.
- ప్రొటోకాల్ ఉన్న అధికారులను సైతం పోలీసులు నెట్టివేయడంతో తాను ప్రొటోకాల్ అధికారిని అంటూ చెప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.
- జాతరను పర్యవేక్షించే ఓ ప్రధాన పోలీసు అధికారి కుటుంబం కూడా ఆ శాఖ అధికారులే నిలిపివేయడంతో అక్కడ ఉన్నవారు అంతా అవాక్కయ్యారు.
- అలాగే ఎన్నో ఏళ్లగా వస్తున్న సంప్రదాయాలను జాతర నిర్వహణ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రాజాలకు అవమానం జరిగింది.
- ఏటా సరవళ్లను అమ్మవారికి సమర్పించే సమయంలో మేళతాళాలతో పోలీసు బందోబస్తు నడుమ అమ్మవారి వద్దకు చేరుకోవడం ఆనవాయితీ. కానీ ఈ ఏడాది ఆ సంప్రదాయాలేవీ నోచుకోలేదు.



వాహనంపై ఊరేగుతున్న ఘటం

- సాక్షాత్తు జిల్లా కలెక్టర్ గూడూరు– వెంకటగిరి రహదారిని బాగు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించినా పనులు మొక్కుబడిగా చేయడం.
- మద్యం నిషేధం ఉన్నా గురువారం యద్దేచ్ఛగా మద్యం షాపుల వద్దనే లభించడం గమనార్హం.
- బాటిల్‌పై షాపు యజమానులే అదనంగా రూ.30 వంతున వసూలు చేసి అమ్మకాలు సాగించడం.
- సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరించడంపై పలు అనుమానాలకు తావిస్తున్నాయి.
- గతంలో జాతరకు రెండు రోజులపాటు మద్యం నిషేధం అమల్లో ఉండేది. ఈ సారి ప్రవేటు వ్యక్తుల చేతుల్లో మద్యం షాపులు ఉండడంతో వారికి ఆదాయం సమకూర్చేలా అధికారులు ప్రోత్సహించడం చోటుచేసుకుంది.
- ఈ విషయమై శనివారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసిన స్థానిక ఎమ్మెల్యే జాతరలో జరిగిన పొరపాట్లపై వాస్తవాలను అంగీకరించడం గమనార్హం.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం



వైఎస్సార్‌సీపీ యువజన విభాగం తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల అధ్యక్షులతో సమావేశం నిర్వహిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీలో యువతే కీలకం
- కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ యువజన విభాగం నాయకులతో భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో యువతే కీలకమని పార్టీ అభ్యున్నతికి తీవ్రంగా కృషి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని పార్టీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం అన్నమయ్య, నెల్లూరు, ఉమ్మడి చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను యువత ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇంత వరకు ఏ ఒక్కటీ సక్రమంగా నెరవేర్చలేదన్నారు. ప్రజా సంక్షేమం, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమ, పోరాటాలు చేపట్టాలని యువతకు భూమన అభినయ్‌రెడ్డి సూచించారు. యువతకు కూటమి ప్రభుత్వం ఇస్తానన్న 20 లక్షల ఉద్యోగాలు, రూ. 3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తానని కూటమి ప్రభుత్వం యువతను దారుణంగా మోసగించిందన్నారు. యువతను మోసగించిన కూటమి ప్రభుత్వానికి యువతే బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లం రవికుమార్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, శివ (అన్నమయ్య జిల్లా), నాగార్జున (నెల్లూరు జిల్లా), పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్, మైనార్టీ విభాగం నాయకులు షేక్ ఇమ్రాన్‌బాషా పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి సహకారం

తిరుపతి అర్బన్ : అభివృద్ధికి పరిశ్రమలు ఎంతో దోహదపడుతాయని రాష్ట్ర పరిశ్రమలశాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్ వెల్లడించారు. శనివారం తిరుపతి బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో సులభతర వాణిజ్యంపై అవగాహన ప్రాంతీయ సదస్సును నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవాడ నుంచి వర్చువల్ పద్ధతిలో పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్ పరిశ్రమలను ప్రోత్సహించడానికి స్థానికంగా అందించాల్సిన ప్రోత్సాహాలను తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమల స్థాపనతోపాటు వాటి అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. గాజులమండ్యం ఐటీ పార్క్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు రోడ్లు, వీధి లైట్లు పరిశ్రమల సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎమ్ విజయ్ భరత్ రెడ్డి, పరిశ్రమలశాఖ డీడీ మురళీ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,842 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.18 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భారత యువత ప్రపంచాన్ని శాసిస్తోంది

- ఎన్ఎస్ఏపీ సభ్యులు సతీష్‌రెడ్డి

తిరుపతి సిటీ : భారత దేశంలో యువత ఆధునిక సాంకేతి విజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకుంటూ ప్రపంచ దేశాలను శాసించే స్థాయికి ఎదుగుతోందని నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యులు, ఏపీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఇన్‌స్పైరింగ్ మైండ్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయుధాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదగడం గర్వకారణమన్నారు. దేశంలో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని, దీంతో ప్రతి ఏడు 15 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు వివిధ కళాశాల నుంచి పట్టాలు పొంది ఉన్నత స్థాయిలో 90శాతం మంది ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. అతిపెద్ద ఆర్థిక దేశంగా రాబోయే రోజుల్లో ప్రపంచం ముందు భారతదేశం ఆవిష్కృతం కానుందని చెప్పారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆలోచన శక్తి పెంచుకోవాలన్నారు. సమయం చాలా విలువైనదని, ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకుని ఆ దిశగా విద్యార్థులు శ్రమించాలన్నారు. అనంతరం డాక్టర్ సతీష్ రెడ్డిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల నుద్దేశించి ప్రసంగిస్తున్న డాక్టర్ సతీష్‌రెడ్డి

రూ.36 కోట్లు అంటున్నారు..


రూ.3.5 కోట్లు ఇస్తే వదిలేస్తాం

- పేరుకు పట్టా భూమే అయినా గృహ నిర్మాణాలకు పనికిరాదు
- తప్పుడు రాతలతో మనస్సు బాధపెట్టొద్దు
- సీఎంఆర్ ఇన్‌ఫ్రా ఎండీ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సవాల్

తిరుపతి రూరల్ : 'మేము వ్యాపారంలో కానీ, రాజకీయాల్లో గానీ ఎప్పుడూ తప్పు చేయలేదు.. చేయబోము కూడా. ఈ రోజు కొన్ని పత్రికల్లో మాపై వచ్చిన వార్తలు అవాస్తవం. పూజారి భూమిని చౌకగా కొట్టేశారని, రూ.36 కోట్లు విలువైన భూమిని రూ.2.93 కోట్లుకు తన పరం చేసుకున్నారని రాశారు.. మీరు అన్నట్టుగా ఆ భూమి విలువ రూ.36 కోట్లు అయితే అందులో పది శాతం రూ.3.5 కోట్లు ఇస్తే చాలు ఆ భూమిని ఎవ్వరికైనా రాసిచ్చేసేందుకు మేం సిద్ధంగానే ఉన్నాం. ఆ భూమిని కొనడానికి వెళ్లినప్పుడు ఆ భూమి పరిస్థితిని చూస్తే ఎవ్వరూ అంత డబ్బు పెట్టడానికి ముందుకు రారు. అక్కడున్న 2.93 ఎకరాల మొత్తం విస్తీర్ణం మాస్టర్‌ప్లాన్, బఫర్ జోన్ పరిధిలోకి వెళుతుంది. ఆ విషయం తుడా మాస్టర్ ప్లాన్‌లోని సర్వే నంబరు 462ను పరిశీలిస్తే అందరికీ అర్థమవుతుంది. అక్కడ ఒక్క సెంటు భూమి కూడా చెట్లు పెంచుకోవడానికి తప్ప ఇళ్లు కట్టడానికి ఉపయోగపడదు. పేరుకు పట్టా భూమే కానీ ఎందుకు ఉపయోగపడదు. ఆ భూమి అభివృద్ధికి రూ.2 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. ఆ భూమి యజమానితో చేసుకున్న ఒప్పందం ప్రకారమే ఆ ల్యాండ్ డెవలప్‌మెంట్ చేశాం. ల్యాండ్ డెవలప్ చేసిన కంపెనీలకు చట్ట బద్ధంగానే డబ్బులు చెల్లించడం జరిగింది. ఎక్కడా ఎవ్వరినీ మోసం చేయలేదు, తప్పు జరగలేదు.' అంటూ సీఎంఆర్ ఇన్‌ఫ్రా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

చట్టబద్ధంగానే చెల్లింపులు

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డిపై పచ్చపత్రికల్లో అవాస్తవ కథనాలు ప్రచురించారని తెలుపుతూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటలోని ఆంశాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు భార్య రేణుక నుంచి తీసుకున్న భూములపై నిజాలను బహిర్గతం చేశారు. ఆ భూముల కొనుగోలు సమయంలో ఇరువురు అనుకున్నట్టుగానే ల్యాండ్‌డెవలప్‌మెంట్ బాధ్యతలను అప్పగించిన కంపెనీలకు పనులు పూర్తవగానే డబ్బులు చెల్లించడం జరిగిందని, అది కూడా చట్ట బద్ధంగానే చెల్లింపులు చేశామే తప్ప ఎక్కడా ఎవ్వరినీ మోసం చేయలేదన్నారు. ఈ విషయం ఆదాయ పన్ను శాఖ అధికారులకు అందించిన దస్త్రాలను పరిశీలించినా తెలుస్తుందన్నారు. అలాగే బినామీ కంపెనీలు అని రాయడంపై స్పందించిన ఆయన అవన్నీ కూడా చట్ట బద్ధంగా ఏర్పాటైన కంపెనీలేనని.. ఆ కంపెనీల డైరెక్టర్లు సిట్ అధికారులను చూసి ఎక్కడా పారిపోలేదని, అధికారులు పిలిచిన వెంటనే గౌరవంగా వారి కార్యాలయానికి వెళ్లి వారు అడిగిన ప్రశ్నలకు రాత పూర్వకంగా స్టేట్‌మెంట్లు రాసి ఇవ్వడం జరిగిందన్నారు. పచ్చ పత్రికల్లో రాసిన అబద్ధపు రాతలతో తమ మనసు కలచి వేసిందన్నారు. ఇకపై పత్రికల్లో రాసే ముందు నిజాలు తెలుసుకుని రాస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.



తుడా మాస్టర్ ప్లాన్‌లో బఫర్ జోన్‌గా కనిపిస్తున్న సర్వే నంబరు 462